క్లుప్తంగా

జగనన్న విద్యాకానుక కిట్లు పంపిణీ



మంగళగిరి: నగర పరిధి యర్రబాలెం ఎంపీయూపీ పాఠశాల, శ్రీనగర్ కాలనీ పాఠశాల విద్యార్థులకు బుధవారం స్థానిక వైఎస్సార్ సీపీ నాయకుల చేతుల మీదుగా విద్యార్థులకు నాలుగవ విడత జగనన్న విద్యా కానుక కిట్లు అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు గుండాల శ్రీనివాసరావు, కాపరౌతు భాస్కరరావు, తాడేకోరు రమేష్, దానబోయిన నాగయ్య, షేక్ షఫీ, ఎస్కే గౌస్, రేమిణిశెట్టి నాగరాజు శరత్, సాలి బంగారయ్య, నల్లిబోయిన శ్రీనివాసరావు, నాయుడు హనుమంతరావు, గోపి, ఇందిర, వెంకటరత్నం తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ రక్తదాతల దినోత్సవం



తాడేపల్లిరూరల్: మంగళగిరిలోని మారుతి మహిళా సొసైటీ కార్యాలయంలో ప్రపంచ రక్తదాత దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమాన్ని ఎన్ఆర్ జనరల్ హాస్పిటల్ సహకారంతో నిర్వహించగా హాస్పిటల్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ వెంకటరామిరెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఆయన మాట్లాడుతూ అన్ని దానాల్లోకెల్లా రక్తదానం గొప్పదని అన్నారు. రోగ్యవంతమైన మనిషి ప్రతి ఆరు నెలలకు ఒకసారి రక్తదానం చేయవచ్చని, రక్తదానంపై అపోహలు పెట్టుకోవద్దని సూచించారు. రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలని అన్నారు. అనంతరం అందరూ రక్తదానం చేశారు. కార్యక్రమంలో మారుతి మహిళా సొసైటీ ప్రాజెక్ట్ మేనేజర్ గిరిజ, సిబ్బంది, బ్లడ్‌బ్యాంక్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి జూడో పోటీలకు జిల్లా విద్యార్థుల ఎంపిక




మంగళగిరి: తిరుపతిలో ఈనెల 17,18,19 తేదీల్లో నిర్వహించే రాష్ట్రస్థాయి జూడో పోటీలకు గుంటూరు జిల్లా నుంచి పలువురు క్రీడాకారులు ఎంపికైనట్లు ఆర్గనైజింగ్ సెక్రటరీ డి ప్రభాకర్ తెలిపారు. నగరంలోని మార్షల్ ఆర్ట్స్ కోచింగ్ సెంటర్‌లో బుధవారం జరిగిన విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడించారు. జిల్లా స్థాయి పోటీల్లో విజేతలుగా నిలిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులు 63 కేజీల విభాగంలో బేబీ ప్రియాంక, 52 కేజీల విభాగంలో అనూష, 44 కేజీల విభాగంలో ప్రసన్న, 60 కేజీల విభాగంలో డి జయరామ్, 73 కేజీల విభాగంలో శ్రీరామ్, 66 కేజీల విభాగంలో ఉదయభాను, 80 కేజీల విభాగంలో ఇసాక్ ఎంపికైనట్లు తెలిపారు. ఎంపికైన క్రీడాకారులను అసోసియేషన్ వర్కింగ్ ప్రెసిడెంట్ పి రాంబాబు, కార్యదర్శి పి శ్రీదేవి, అధ్యక్షుడు అరవింద మహర్షి లు అభినందించినట్లు తెలిపారు.

నీరుకొండలో ఘర్షణ

ఇరువురికి గాయాలు

మంగళగిరి: మండల పరిధిలోని నీరుకొండ గ్రామంలో మంగళవారం రాత్రి చోటుచేసుకున్న ఘర్షణలో ఇద్దరికి గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల మేరకు బీసీ కాలనీలోని రోడ్లకు గ్రావెల్ తోలే క్రమంలో ట్రాక్టర్ల డ్రైవర్లు ఇద్దరి మధ్య వివాదం చెలరేగింది. తోట వెంకటేశ్వరరావు, తాడిబోయిన సాంబశివరావులు మధ్య జరిగిన వివాదం ఇరు కుటుంబాల మధ్య ఘర్షణకు కారణమైంది. ఘర్షణలో వెంకటేశ్వరరావు, సాంబశివరావులు గాయపడగా ఇరువురిని చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఆటపాటలతో కూడిన విద్యతో చిన్నారుల్లో ఉల్లాసం



నెహ్రూనగర్: చిన్నారులకు ఆటపాటలతో కూడిన విద్య ఎంతో అవసరమని సీడీపీవో కృష్ణవేణి తెలిపారు. సుద్దపల్లి డొంక అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం జన్‌భాగీదారీ కార్యక్రమంలో భాగంగా తల్లులకు, చిన్నారులకు యాక్టివిటీస్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీడీపీవో మాట్లాడుతూ ఆటపాటలతో కూడిన విద్య ద్వారా పిల్లలు మానసికంగా, ఉల్లాసంగా ఉంటారని తెలిపారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ నీలిమ, అంగన్‌వాడీ సిబ్బంది సుధ, విజయకుమారి, అరుణ, సాధిక పాల్గొన్నారు.

టిడ్కో గృహాలు విక్రయిస్తే సేల్‌డీడ్ రద్దు

- విలువైన టిడ్కో గృహాలను విక్రయించుకుని నష్టపోవద్దు
- ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే), ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు



టిడ్కో ఇళ్ల సేల్ డీడ్‌లను లబ్ధిదారులకు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ఆర్కే, ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు

మంగళగిరి: నగర నడిబొడ్డున ఎంతో విలువ కలిగిన టిడ్కో గృహాలను లబ్ధిదారులు విక్రయిస్తే వారి సేల్ డీడ్‌లను రద్దు చేసి విక్రయించిన వారితోపాటు కొనుగోలు చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే) స్పష్టం చేశారు. నగరంలోని నగర పాలక సంస్థ కార్యాలయంలో బుధవారం టిడ్కో లబ్ధిదారులు 156 మందికి సేల్‌డీడ్‌లను ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావుతో కలిసి పంపిణీ చేశారు. ఎమ్మెల్యే ఆర్కే మాట్లాడుతూ నగరంలోని మంగళగిరి ఆటోనగర్‌తోపాటు రాజధాని పరిధిలోని నిడమర్రు, నవులూరు, యర్రబాలెం, కృష్ణాయపాలెంలలో ఎంతో విలువైన స్థలాల్లో టిడ్కో ఇళ్లు నిర్మాణం చేసి అన్ని మౌలికవసతులు కల్పించి లబ్ధిదారులు నివసించేందుకు సకల వసతుల కోసం ప్రభుత్వం కోట్లు ఖర్చు పెట్టిందన్నారు. ఆయా ప్రాంతాలలో స్థలాలు ఎంతో విలువతో కూడుకున్నవి అని అలాంటి విలువైన స్థలాలు కలిగిన గృహాలను చిన్న అవసరాల కోసం తాకట్టు పెట్టడం, విక్రయించడం చేసి వృథా చేసుకోవద్దన్నారు. భవిష్యత్తులో తమ పిల్లలకు ఎంతో విలువతో కూడిన ఆస్తిని అందజేసిన వారవతారన్నారు. అర్హులైన పేదలకు కొందరు దళారులు మరికొందరు వివిధ పార్టీల నాయకులు ఏదో మాయమాటలు చెప్పి టిడ్కో గృహాలను కొట్టేయాలనే ప్రయత్నాలకు లబ్ధిదారులు వారి మాయలో పడి మోసపోవద్దన్నారు. చిన్న చిన్న అవసరాలకు పంతాలకు పోయి గృహాన్ని పోగొట్టుకుంటే భవిష్యత్తులో మరలా గృహాలను సంపాదించుకోలేరని గుర్తించుకోవాలన్నారు. కొందరు విక్రయిస్తున్నారని దళారుల మాటలు నమ్మి కొనుగోలు చేస్తే కొనుగోలు చేసిన వారు నష్టపోకతప్పదని హెచ్చరించారు. విక్రయించిన వారి సేల్ డీడ్ రద్దు చేసి కొనుగోలు చేసిన వారిని ఖాళీ చేయించి మరొక అర్హులైన పేదలకు ఆ ఇంటిని కేటాయించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో నగర కమిషనర్ యు శారదాదేవి, అడిషనల్ కమిషనర్ హేమమాలిని, డిప్యూటీ కమిషనర్ శివారెడ్డి, ఎస్ఈ శ్రీనివాస్ రెడ్డి, డీసీపీ మహాలక్ష్మీ దొర, డీఈ కృష్ణారెడ్డి, సీఆర్‌డీఏ ఎంపీడీవో శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఎంతో కాలంగా ఎదురుచూస్తున్నాం



ఎంతో కాలంగా సొంత నివాసం కోసం ఎదురుచూస్తున్నాం. ఆలస్యమైనా అన్ని వసతులు కల్పించి ఇళ్లు ఇవ్వడం ఆనందంగా ఉంది. వెంటనే సొంతింట్లోకి వెళ్తాం. అద్దె ఇళ్లల్లో ఉంటూ అద్దెలు చెల్లిస్తూ మా లాంటి దివ్యాంగులు పడే అవమానాలు బాధలు ఎన్నో ఉంటాయి. మా లాంటి పేదల సొంతింటి కల నెరవేర్చిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి పేదలంతా అండగా ఉంటారు.

–మంచి కుమారి, ఉండవల్లి

కల నెరవేరింది



సొంతింటి కల నెరవేరడంతో సంతోషంగా ఉంది. టిడ్కో ఇళ్లల్లో అన్ని మౌలిక వసతులు కల్పించడంతో ఎలాంటి ఇబ్బంది లేకుండా నివాసం ఉండే అవకాశం కలిగింది. ఇళ్లు లేని పేదలందరికి ఇళ్లు కట్టించి ఇచ్చేందుకు కృషి చేస్తున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పేదల కష్టాలు తెలిసిన నాయకుడు అవడం వలనే పేదలను ఆదుకుంటున్నారు.

– కాజ నాగమణి, కురగల్లు

శ్మశానవాటికలో ఆగని దొంగతనాలు



మెల్లెంపూడి హిందూ శ్మశానవాటికలో బీడు ప్లేట్లను అపహరించిన దృశ్యం

తాడేపల్లిరూరల్: మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని పలు ప్రాంతాల్లోని శ్మశానవాటికలను కూడా వదలకుండా దొంగలు తమ చేతివాటాన్ని ప్రదర్శిస్తున్నారు. బుధవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఈ దొంగతనం మెల్లెంపూడి హిందూ శ్మశానవాటికలో చోటుచేసుకుంది. మెల్లెంపూడి శ్మశానవాటికలో దాతల సహాయంతో అభివృద్ధి కమిటీ వారు శ్మశానవాటికను అందంగా తీర్చిదిద్దారు. మృతదేహాలను దహనం చేసేందుకు బీడు ప్లేట్లతో నిర్మాణం చేశారు. ఆ బీడు ప్లేట్లను గుర్తుతెలియని వ్యక్తులు దొంగిలించుకుపోయారు. ఇదిలా ఉండగా ఇప్పటంలో ఉన్న శ్మశానవాటిలో కూడా బీడు ప్లేట్లను దొంగిలించేందుకు ప్రయత్నించారు. పూర్తి స్థాయిలో బోల్టులు రాకపోవడంతో వాటిని అక్కడే వదిలివేశారు. పెనుమాకలో కూడా ఇదే విధంగా దొంగతనం జరిగి వారం రోజులు గడవక ముందే మెల్లెంపూడిలో జరడగం, ఇప్పటంలో విఫలయత్నం చేయడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. పోలీసుల నిఘా లోపం వల్లే ఇలాంటి సంఘటనలు పునరావృతం అవుతున్నాయని స్థానికులు వ్యాఖ్యానిస్తున్నారు.

బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే ఆర్థిక సాయం

తాడేపల్లిరూరల్: దుగ్గిరాల మండలం పెదకొండూరులో అనారోగ్యంతో బాధపడుతున్న బాధిత కుటుంబాలకు ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి ఆర్థిక సాయం ప్రకటించారు. పెదకొండూరు ఎస్సీ కాలనీకి చెందిన సుద్దపల్లి మౌనిక రూ.10 వేలు, కొండూరు అనిల్‌కు రూ.10 వేలు, కుక్కమళ్ల మాణిక్యం రూ.15వేలు, యడ్లూరి మరియమ్మకు రూ.10 వేలు దుగ్గిరాల ఎంపీపీ దానబోయిన సంతోషరూపవాణి, జిల్లా బీసీసెల్ అధ్యక్షులు దానబోయిన వెంకటేశ్వరరావులు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు కొండూరు సుమన్, వైఎస్సార్‌సీపీ నాయకులు బర్మా అర్జున్, కొండూరు కిరణ్, చంటి తదితరులు పాల్గొన్నారు.

స్కూల్ బస్సుల నిర్వహణలో అశ్రద్ధ వహించవద్దు



ఉండవల్లి అమరావతి రోడ్డులో స్కూల్ బస్సును తనిఖీ చేస్తున్న మోటర్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ విజయ్‌శరద్

- నిబంధనలు పాటించపోతే చర్యలు తీసుకుంటాం
- మంగళగిరి మోటర్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ విజయ్‌శరద్

తాడేపల్లిరూరల్: స్కూల్ బస్సుల నిర్వహణలో అశ్రద్ధ వహించి నిబంధనలు పాటించకపోతే కఠినచర్యలు తీసుకుంటామని మంగళగిరి మోటర్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ విజయ్ శరద్ అన్నారు. బుధవారం ఉండవల్లి అమరావతి రోడ్డులో స్కూల్ బస్సును తనిఖీ చేశారు. తనిఖీలో విజయవాడకు చెందిన ఎస్ఆర్ జూనియర్ కళాశాల బస్సులో ఫస్ట్ ఎయిడ్ బాక్స్ లేకపోవడం, ఫైర్ సిలెండర్లు కాలం చెల్లినవి కావడం, డ్రైవర్ కూడా 60 సంవత్సరాలు పైబడి ఉండడంతో సదరు బస్సుపై కేసు నమోదు చేశారు. ఆయన మాట్లాడుతూ స్కూల్ యాజమాన్యాలు విద్యార్థులను బస్సులో తీసుకు వెళ్లేటప్పుడు జాగ్రత్త వహించాలని, డ్రైవర్ వయస్సు 60 సంవత్సరాలు మించడకూడని, బస్సులో ఫిట్‌నెస్ సర్టిఫికేట్‌తో పాటు ఇతర పత్రాలు అన్నీ ఫోర్స్‌లో ఉండాలని, స్కూల్ బస్‌కు తప్పనిసరిగా ఎమర్జెన్సీ డోర్‌తో పాటు ఫస్ట్ ఎయిడ్‌కిట్, ఫైర్ సేఫ్టీ సిలెండర్లను ఉంచాలని తెలిపారు. పరిమితికి మించి విద్యార్థులను బస్సులో ఎక్కిస్తే సదరు స్కూల్ బస్సు యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు.

దిశ యాప్‌ను సద్వినియోగం చేసుకోవాలి

- పట్టణ సీఐ బి అంకమ్మరావు

మంగళగిరి: దిశ యాప్‌ను సద్వినియోగం చేసుకుని ఆపత్కాలంలో పోలీస్ వారి సేవలను వినియోగించుకోవాలని మంగళగిరి పట్టణ సీఐ బి అంకమ్మరావు పేర్కొన్నారు. నగరంలోని అంబేద్కర్ విగ్రహం సెంటర్‌లో బుధవారం దిశ యాప్‌పై స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. యువతీ, యువకులు, మహిళలకు దిశ యాప్ ఫోన్‌లో డౌన్‌లోడ్ చేయించి అవగాహన కల్పించారు. సీఐ మాట్లాడుతూ దిశ యాప్‌లో ప్రభుత్వం తీసుకువచ్చిన మార్పులతో మరింత కఠినతరంగా అమలు చేయనున్నట్లు తెలిపారు. ప్రభుత్వం ప్రజల రక్షణ కోసం తీసుకువచ్చిన దిశయాప్‌ను ప్రతి ఒక్కరూ తమ ఫోన్లలో డౌన్‌లోడ్ చేసుకుని అత్యవసర పరిస్థితుల్లో వినియోగించుకోవాలని కోరారు. దిశ యాప్‌తో ఎంతో మంది రక్షణ పొందుతున్నారని, దిశయాప్ దేశానికికే ఆదర్శంగా నిలిచిందన్నారు. ముఖ్యంగా టీనేజి యువతీ,యువకులతో పాటు ప్రతి ఒక్కరూ దిశ యాప్‌ను తప్పనిసరిగా తమ ఫోన్లలో డౌన్‌లౌడ్ చేసుకునేలా అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు.

కైలాసగిరి కార్యవర్గం ఎన్నిక

మేడికొండూరు: మండలంలోని పేరేచర్ల కైలాసగిరి పాలక మండలి నూతన కమిటీ సమావేశం బుధవారం జరిగింది. నూతన కమిటీ చైర్మన్‌గా మేడికొండూరు జెడ్పీటీసీ సభ్యుడు కందుల సిద్ధయ్య, వైస్ ప్రెసిడెంట్‌గా ముక్కు ప్రభాకర్‌రెడ్డి, సెక్రెటరీ ఉడతా ప్రభాకరరావు, జాయింట్ సెక్రెటరీ ఐలా రఘు, ట్రెజరర్ వెంకట సుబ్బారెడ్డి, సభ్యులుగా గుంటుపల్లి శ్రీనివాసరావు, కార్యనిర్వాహక సభ్యులు ఆవుల సంజీవరెడ్డి, జంపని శ్రీకాంత్, అందుగల ప్రవీణ్ ఎన్నికయ్యారు. సిద్ధయ్య విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కైలాసగిరి అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తామన్నారు.

పురాతత్వ సంపదను ముందు తరాలకు అందించాలి



కార్యక్రమంలో ప్రసంగిస్తున్న ప్రొఫెసర్ మొవ్వ శ్రీనివాస్‌రెడ్డి

తాడేపల్లిరూరల్: పురాతత్వ సంపదను ముందు తరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని లయోల కాలేజీ ప్రొఫెసర్ మొవ్వ శ్రీనివాస్ రెడ్డి అన్నారు. బుధవారం ఎంటిఎంసి పరిధిలోని ఉండవల్లి గుహల వద్ద అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా లయోల కాలేజీ ప్రొఫెసర్ మొవ్వ శ్రీనివాస్‌రెడ్డి విచ్చేశారు. ముందుగా ఉండవల్లి అమరావతి రోడ్‌లో ఉండవల్లి గుహల వద్ద ర్యాలీని నిర్వహించారు. అనంతరం శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ ఆజాదికా అమృత మహోత్సవ కార్యక్రమంలో భాగంగా ఆర్కియాలజికల్ సర్వే ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించామని తెలిపారు. మన ముందు తరాల వారు మనకు ఇచ్చిన పురాతత్వ సంపదను మనం భావితరాలకు అందజేయాలని అన్నారు. పురాతత్వ సంపదను మనం పరిరక్షిస్తేనే ముందు తరాలకు అందివ్వగలరని వివరించారు. కార్యక్రమంలో డీవైఎస్ ఏఈ వీరాంజనేయులు, డాక్టర్ డీఎస్ బోయ్, నాగేంద్రకుమార్, ఫణీంద్రకుమార్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులను జాప్యం చేయవద్దు

- అభ్యంతరాలు లేని చోట వెంటనే రోడ్డు నిర్మాణాలు చేపట్టండి
- నెలాఖరుకల్లా ఇప్పటంలో రోడ్డు నిర్మాణం పూర్తిచేయాలి
- ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే)



ఇప్పటంలో రోడ్డు విస్తరణ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ఆర్కే

తాడేపల్లిరూరల్ :మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని ఇప్పటంలో జరుగుతున్న రోడ్డు విస్తరణ పనులను ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి బుధవారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ రోడ్డు విస్తరణ పనుల్లో బాగా జాప్యం జరుగుతోందని, అభ్యంతరాలు లేని ప్రాంతాల్లో రోడ్డు విస్తరణ పనులు, డ్రెయినేజీ పనులు వెంటనే పూర్తి చేయాలని, ఎక్కడెక్కడ అభ్యంతరాలు ఉన్నాయో వాటిని త్వరితగతిన పరిష్కరించి ఇప్పటంలో అనుకున్న రీతిలో రోడ్డు నిర్మాణ పనులు చేయాలని అధికారులకు సూచించారు. ఇప్పటంలో దాదాపుగా మూడు కోట్ల వ్యయంతో అభివృద్ధి పనులు చేపట్టారు. వాటిలో సగం పనులు కూడా పూర్తికాకపోవడంతో అసహనం వ్యక్తం చేసి ఆ పనులు జూన్ నెలాఖరుకు పూర్తిచేయాలని అధికారులను, కాంట్రాక్టర్లను ఆదేశించారు. పంటపాలాల్లో నిర్మిస్తున్న బీటీరోడ్ నిర్మాణ పనులతోపాటు, జగనన్న కాలనీకి ఏర్పాటు చేస్తున్న రోడ్డు విస్తరణ పనులు అడిగి తెలుసుకున్నారు. వర్షాలు ప్రారంభమయ్యేనాటికి ఇప్పటంలో ఎటువంటి పనులు పెండింగ్‌లో ఉండకూడదని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో డీఈ కృష్ణారెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు మున్నంగి వివేకానందరెడ్డి, హరిబాబుగౌడ్, ప్రవీణ్‌గౌడ్, లచ్చి వెంకటేశ్వరరావు, తులసీదాసు, అమిరిశెట్టి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పనులు నాసిరకంగా చేస్తే కాంట్రాక్టర్‌పై చర్యలు

మంగళగిరి: నగరంలో జరుగుతున్న అభివృద్ధి పనులను మరింత వేగవంతం చేయాలని ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే) అన్నారు. నగరంలోని కార్పొరేషన్ కార్యాలయంలో మంగళవారం నగర పాలక సంస్థ అధికారులతో అభ్వివృద్ధి పనులపై ఎమ్మెల్యే ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావుతో కలసి సమీక్షా సమావేశం నిర్వహించారు. ముఖ్యంగా తుదిదశకు చేరుకున్న రాజీవ్ గృహకల్ప వద్ద మగ్గం షెడ్లు, పాత బస్టాండ్ ఆవరణలోని చేనేత భవన్, ఆత్మకూరు గుంటూరు ఛానల్ వద్ద గల తాగునీటి పథకం ఆవరణలో కొనసాగుతున్న స్విమ్మింగ్ పూల్, స్కేటింగ్ రింక్ పనులను సత్వరమే పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు. కోట్ల రూపాయలతో చేపట్టిన అభివృద్ధి పనుల్లో నాణ్యతలో రాజీపడకుండా పనులు పూర్తి చేయాలన్నారు. నిర్మాణాలను క్వాలిటీ కంట్రోల్ అధికారులతో పరీక్షలు నిర్వహించి నాసిరకం అని తేలితే కాంట్రాక్టర్‌పై చర్యలు తప్పవన్నారు. నగర పరిధిలో జరుగుతున్న పలు రోడ్ల నిర్మాణాలను రెండు నెలల్లో పూర్తి చేయాలన్నారు. నిడమర్రు రైల్వేగేటు వద్ద డంపింగ్‌యార్డులోని చెత్త తరలింపును వేగవంతం చేసి ఈ నెలాకరు నాటికి ఖాళీ చేసి ప్రజలకు ఆహ్లాదాన్ని, ఆరోగ్యాన్ని అందించేలా పార్క్ నిర్మాణం చేపట్టాలన్నారు. నగర పరిధిలోని అంతర్గత రోడ్లుతోపాటు కార్పొరేషన్‌లో విలీనమైన గ్రామాల్లో మిగిలిన రోడ్ల నిర్మాణాలు చేపట్టాలన్నారు. నగర పరిధిలోని నిడమర్రు– తాడికొండ రోడ్డు విస్తరణ పనులు వేగవంతం చేయాలన్నారు. రోడ్ల నిర్మాణాలపై ప్రత్యేక దృష్టి సారించి నిరంతరం అధికారులు పర్యవేక్షిస్తూ త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు.

ఇంజినీరింగ్ విభాగం కార్యాలయం ప్రారంభం

నగరపాలక సంస్థ కార్యాలయ ఆవరణలో నూతనంగా ఏర్పాటు చేసిన ఇంజినీరింగ్ విభాగం కార్యాలయాన్ని ఎమ్మెల్యే ఆర్కే, ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, కమిషనర్ యు శారదాదేవి ప్రారంభించారు. ఎమ్మెల్యే ఆర్కే మాట్లాడుతూ నగర అభివృద్ధిలో ఇంజనీరింగ్ విభాగం పాత్ర ప్రధమంగా ఉంటుందని, విభాగానికి ప్రత్యేక ఛాంబర్ ఏర్పాటు చేసుకోవడం అభినందనీయమన్నారు. నగర పరిధిలోని ఆత్మకూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న మరమ్మతు పనులను పరిశీలించి అధికారులకు తగు సూచనలు చేశారు. కార్యక్రమంలో నగరపాలక సంస్థ అడిషనల్ కమిషనర్ హేమమాలిని, అసిస్టెంట్ కమిషనర్ లక్ష్మీకాంతం, డిప్యూటీ కమిషనర్ శివారెడ్డి, ఎస్ఈ శ్రీనివాసరెడ్డి, డీసీపీ మహాలక్ష్మి దొర, డీఈ కృష్ణారెడ్డి, ఏఈ లు కిషోర్, రమేష్ ఆయా శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

యానాదులు ఆర్థికంగా ఎదుగుతున్నారు

తాడేపల్లిరూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాల వల్లే రాష్ట్రంలో యానాదులు ఆర్థికంగా ఎదుగుతున్నారని యానాదుల సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యందేటి వెంకటసుబ్బయ్య అన్నారు. బుధవారం దుగ్గిరాల మండల పరిధిలోని యానాదుల కాలనీలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. విజయవాడ వేదికగా త్వరలో యానాదుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో యానాది గర్జన నిర్వహిస్తామని, యానాదులందూ తరలి రావాలని పిలుపునిచ్చారు. అనంతరం దుగ్గిరాల ఎస్‌టి యానాదుల కాలనీలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో యానాదుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధితి బాపట్ల బ్రహ్మయ్య, ఉపాధ్యక్షులు రావూరి రాజు, గుంటూరు జిల్లా అధ్యక్షులు కొమరగిరి సూరిబాబు, ప్రధాన కార్యదర్శి మేకల ఎనివాసరావు, గుంటూరు జిల్లా మహిళా అధ్యక్షురాలు జున్ను కళ్యాణి, వర్కింగ్ ప్రెసిడెంట్ కొమరగిరి చెంచయ్య పాల్గొన్నారు.